నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శుక్రవారం | అక్టోబర్ 25, 2024 | www.navatelangana.com

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

నవతెలంగాణ-జన్నారం

గ్రామాలలో పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని డీఎల్పీఓ ధర్మారాణి అన్నారు. గురువారం మండలంలోని రెండ్లగూడ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. బోర్‌వెల్, బావుల దగ్గర మురుగునీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న నర్సరీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ విడుదల

- ఒక్కో కార్మికునికి రూ.93,750 చెల్లింపు

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల చేసినట్లు మందమర్రి జీఎం కార్యాలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి బోనస్‌గా పిలవబడే పిఎల్ఆర్ఎస్(ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్)ను శుక్రవారం సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క గురువారం సచివాలయంలో ప్రకటించారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50కోట్లు అధికం. దీపావళి బోనస్‌ను శుక్రవారం కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బోనస్ కింద ఒక్కో కార్మికుడు రూ.93,750 అందుకోనున్నారు. సంస్థలో పనిచేస్తున్న 40,000 మంది కార్మికులకు బోనస్ వర్తిస్తుంది. ఈ నెలలో దీపావళి బోనస్‌తో కలిపి కార్మికులకు దాదాపు రూ.1250కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లు కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున లక్షా90 వేల రూపాయలు అందాయి.

బాసర ట్రిపుల్ ఐటీకి హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యను అభ్యసించి బయటకు వచ్చిన విద్యార్థులకు సంబంధించిన ఫీజులు ప్రభుత్వం చెల్లించనందుకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి సామల ఫణి కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ ఒక్క విద్యార్థి కాదు వేల మంది విద్యార్థులకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుందని, వాస్తవానికి ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన వాళ్లంతా ఉచిత విద్యను అభ్యసించడానికి హక్కు ఉందని, దానికి సంబంధించిన పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలని, పిటీషనరు విద్యార్థి తరపున హైకోర్టు న్యాయవాది తక్కురి చందన వాదనలు వినిపించారు. దీంతో తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్‌కి, ట్రిపుల్ ఐటీ యాజమాన్యానికి హైకోర్టు నోటీసులు జారీ చేసిందని పిటిషనర్ గురువారం నవతెలంగాణకు ఫోన్‌లో తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ..ఒకరు మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరగడంతో ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన గుండేటి శేఖర్(34) కొంతకాలంగా బత్తుల వెంకటేష్ అనే మేస్త్రి వద్ద కూలి పనులకు వెళ్లేవాడు. అట్టి కూలి డబ్బులను బత్తుల వెంకటేష్ గుండేటి శేఖర్‌కు ప్రతి శనివారం ఇచ్చేవాడు. గత శనివారం రావాల్సిన కూలి డబ్బులు మృతుడికి వెంకటేష్ ఇవ్వకపోవడంతో డబ్బుల గురించి గత శనివారం నుంచి వ్యక్తుల మధ్య వెంకటేష్‌ను అడుగగా గురువారం ఉదయం 6 గంటల 45 నిమిషాల ప్రాంతంలో మండల కేంద్రంలోని జై హనుమాన్ స్వీట్ హోమ్ వద్ద బత్తుల వెంకటేష్‌ను గుండేటి శేఖర్ కూలి డబ్బులను అడగగా నా దగ్గర డబ్బులు లేవు అంటూ దుర్భాషలాడుతూ కాలర్ పట్టుకుని మెడలో ఉన్న తాడును పట్టుకుని లాగడంతో ఊపిరాడక స్పృహకోల్పోయాడు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బోథ్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నీటి ట్యాంకులు క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలి



నవతెలంగాణ-జైపూర్

పరిశుభ్రమైన తాగు నీటి సరఫరా కోసం క్రమం తప్పకుండా వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు సూచించారు. మొబైల్ యాప్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విద్యాసాగర్‌తో కలిసి ఇందారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ పరిధిలో తాగు నీటి సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ తీరును పరిశీలించారు. రోడ్లపై ఎక్కడ కూడా ప్లాస్టిక్ వస్తువులు కన్పించకుండా శుభ్రం చేయించాలని, ప్రతి రోజు రోడ్లు శుభ్రం చేయడంతో పాటు మురుగు కాలువలు శుభ్రం చేయించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్లాస్టిక్ వస్తువులను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు శాతం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు పట్టిక పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికరమైన ఆహారం అందించాలని సూచించారు.

మొదలైన ఎన్‌హెచ్-63 సర్వే

నవతెలంగాణ - హాజీపూర్

ఎన్‌హెచ్-63 సర్వే పనులు మళ్లీ మొదలయ్యాయి. గురువారం నర్సింగపూర్ శివారులో గ్రామీణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ భూముల్లో బావులు, బోర్లు, పైప్ లైన్‌ల సర్వే నిర్వహించారు. మూడు నెలలుగా సర్వేకు దూరంగా ఉండడంతో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం క్యాన్సల్ అయిందనే చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో అధికారులు మళ్లీ సర్వే బాట పట్టడంతో భూములు కోల్పోయే రైతుల్లో ఆందోళన మొదలైంది. పరిహారం విషయం తేల్చిన తరువాతే సర్వే నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పంట సాగుకు ముందు విత్తన శుద్ధి చేపట్టాలి

జైపూర్ : మండల పరిధిలో వేరు శనగ పంట సాగు చేస్తున్న రైతులు ముందుగా విత్తన శుద్ధి చేపట్టాలని వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ సూచించారు. గురువారం నర్సింగాపూర్ శివారులో వేరు శనగ పంటలు సాగు చేస్తున్న రైతులను కలిసిన ఆయన వేరు శనగ పంటల సాగులో విత్తన శుద్ధితో పాటు మెళకువలు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి ఆశించిన మేరకు పొందవచ్చని తెలిపారు. కాజిపల్లి శివారులో సాగు చేసిన వరి పంట క్షేత్రాలను సందర్శించి వరి పైరులో దోమపోటు గుర్తించారు. దోమ పోటు నివారణ కోసం డైనోట్ ఫిరాన్ 100 గ్రాములు, పైమెట్రో జెన్ 120 గ్రాములు, డైనోట్ ఫిరాన్ ప్లస్ పైప్ మెట్రో జెన్ 133 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటితో పైన తెలిపిన పిచికారి మందుల్లో ఏదైనా పిచికారి చేయడం ద్వారా దోమ పోటు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బొల్లంపల్లి అరుణ్‌కుమార్, రైతులు దాడి రాజబాబు, కొండ చంద్రశేఖర్ పాల్గొన్నారు..

శ్రీచైతన్య టెక్నో స్కూల్లో హెల్త్ ఇండియా ప్రోగ్రాం

లక్సెట్టిపేట: శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో హెల్త్ ఇండియా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యం.అశ్విని విద్యార్థులకు హెల్త్ ఇండియా, స్మార్ట్ అనింగ్ గురించి వివరించి విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన మంచి విషయాలు చెప్పారు. యోగా జీవితంలో ఎంత ముఖ్యమో వివరించి పిల్లలతో కొన్ని యోగాసనాలు వేయించారు. అనంతరం పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.రఘు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రాజు కంటి పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని ఆదిత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం ఆది సతీష్, పాఠశాల డీన్ వి.శ్రీనివాస్, డైరెక్టర్ శ్రీవిద్య, ప్రైమరీ ఇన్‌చార్జి శైలజ, పిఈటీ కిషన్ పాల్గొన్నారు.

సర్ఫేస్ ఉద్యోగాలకు కౌన్సెలింగ్

మందమర్రి: సింగరేణిలోని సర్ఫేస్ ఉద్యోగాలకు మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్‌లకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో బెల్లంపల్లి శాంతిఖని గనిలో మహిళ బదిలీ వర్కర్లు/జనరల్ మజ్దూర్‌లకు సర్ఫేస్‌లోని 16 డెసిగ్నేషన్‌లో ఉద్యోగాలకు కమిటీ సభ్యులు ఏరియా ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీజీ ఎంఐఈడి రాజన్న, డాక్టర్ ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్ జయవాణి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ అందించిన తర్వాత సంబంధిత ఉద్యోగాల్లో నియమిస్తామన్నారు. కార్యక్రమంలో డివైపిఎం సత్యబోస్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్..!

- ఉత్సాహం నింపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన
- రైతులు, పేదలకు అండగా ఉంటామని భరోసా
- ఆదిలాబాద్ పత్తికి గుజరాత్ ధర ఇవ్వాలని డిమాండ్
- సింగరేణి, సిమెంట్‌పై అదానీకన్నుపడిందని వ్యాఖ్య
- పోరుబాట బహిరంగ సభకు భారీగా హాజరైన రైతులు, ప్రజలు



మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదిలాబాద్ పర్యటన గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ప్రతిపక్ష పార్టీగా తొలిసారి నిర్వహించిన బహిరంగ కావడం..ఈ సభకు కేటీఆర్ హాజరుకావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపినట్లయింది. ఈ సభకు ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతుల కోసం రామన్నల పోరుబాట పేరిట మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. బోథ్, ఆసిఫాబాద్, కోరుట్ల, హుజురాబాద్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మీ, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, మాజీ జడ్పీ ఛైర్మెన్లు రాథోడ్ జనార్దన్, లోలం శ్యాంసుందర్ హాజరయ్యారు.

రైతులు, పేదలకు అండగా ఉంటాం

బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సభకు ఆదిలాబాద్‌కు వస్తుంటే ఉట్నూర్‌లో కేసు నమోదైన దృష్ట్యా పోలీసులు అరెస్టు చేస్తారేమోనని జోగురామన్న చెప్పారని.. రైతుల కోసం తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధమని చెప్పినట్లు ఆయన వెల్లడించారు. కళ్యాణలక్ష్మీలో భాగంగా తులం బంగారం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని.. మాట ఇచ్చి మోసం చేశారని ఆడబిడ్డలందరూ కాంగ్రెస్ నాయకులపై కేసు పెడితే ఎవరి మీద కేసు అవుతుందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఖానాపూర్ చెరువు కట్ట ఇండ్లు కూల్చేందుకు వచ్చారనే కారణంగా కాలనీకి చెందిన బొడిగం గంగన్న అనే వ్యక్తి తిడితే కేసు పెట్టారని..మరి వంద రోజుల్లోనే అన్ని చేస్తామని చెప్పిన కాంగ్రెస్ వాళ్లపై ఎన్ని కేసులు పెట్టాలా..అని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా ఉద్యమాలకు పురిటిగడ్డ అని తెలంగాణ ఉద్యమ సమయంలో బోరజ్ వద్ద నిర్వహించిన సడక్‌బంద్‌లో పాల్గొన్నట్లు గుర్తుచేశారు. హామీలు అమలు చేయాలని ముక్రా గ్రామస్తులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారని తెలిపారు. ఎన్నికల్లో గెలిపిస్తే సిమెంట్ పరిశ్రమను తెరిపిస్తామని హామీనిచ్చిన బీజేపీ ప్రజాప్రతినిధులు గెలిచిన తర్వాత ఎందుకు ప్రారంభించలేదని మండిపడ్డారు. బీజేపీ మోసగాళ్ల పార్టీ అని విమర్శించారు.

సింగరేణి..సిమెంట్‌పై అదాని కన్ను

రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పితే కాలుష్యం పెరుగుతుందని అక్కడి ప్రజలు అడ్డుకున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. దీనితో పాటు బెల్లంపల్లిలోని ఓరియంట్ సిమెంట్‌ను అదాని కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని..సింగరేణిని మీద వారి కన్నుపడిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌లో కంటే తెలంగాణలో పండించే పత్తి పంట మేలురకమని తమిళనాడు టెక్స్‌టైల్స్ అధికారులు చెప్పారని గుజరాత్ తరహా ఆదిలాబాద్ పత్తికి కూడా ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు కరంజి, కుచులాపూర్ గ్రామాలకు చెందిన రైతులు భూమారెడ్డి, జనార్దన్‌లు మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతుభరోసా, రైతుబీమా వంటి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉట్నూర్ మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రంగినేని మనీష, పార్టీ పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్, నాయకులు జాన్సన్ నాయక్, సర్సన్ లింగారెడ్డి, తుల శ్రీనివాస్, యూనిస్‌అక్బానీ, మార్శెట్టి గోవర్దన్, సాజిదొద్దీన్, మర్సుకోల సరస్వతి, పార్టీకి చెందిన కౌన్సిలర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జోగు రామన్న

ఆకస్మిక బదిలీలో అనుమానాలెన్నో..!

- వివాదాస్పదమౌతోన్న మంచిర్యాల సీఐ ఆకస్మిక బదిలీ
- బాధ్యతలు మరిచి వసూళ్లకు తెర లేపడంటూ విమర్శలు

నవతెలంగాణ-మంచిర్యాల

సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ అందరికి అండగా నిలవాల్సిన కొందరు పోలీసులు బాధ్యతలను మరిచి ఆ శాఖకు చెడ్డపేరు తెస్తున్నారు. అదే కోవలో వారం రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీపై వెళ్లిన మంచిర్యాల పట్టణ సీఐ తీరు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. బాధ్యతలను మరిచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నప్పటికీ రౌడీలను నియంత్రించే విషయంలో విఫలంమయ్యారని, రాజకీయ నాయకులను, రౌడీలను ప్రోత్సహిస్తూ అమాయక ప్రజలపై అక్రమంగా కేసులు నమోదు చేసి బెదిరింపులకు పాల్పడ్డాడన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. పట్టణంలో లాఅండ్‌ఆర్డర్ పూర్తిగా దెబ్బతినేలా వ్యవహరించాడని, అందుకే ఉన్నతాధికారులు ఆకస్మాత్తుగా సీఐపై బదిలీ వేటు వేశారని పట్టణంలో చర్చ కొనసాగుతోంది. పైఅధికారిని లెక్క చేయకపోవడం, పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులతో సెటిల్మెంట్లకు తెర లేపాడన్న ఆరోపణల దృష్ట్యా సీఐకి ఉన్నతాధికారులు ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా ఐజి ఆఫీస్‌కు ఆకస్మికంగా బదిలీ చేశారని విశ్వసనీయ సమాచారం.

జూన్ నెలలో బీఆర్ఎస్ యువనాయకుడు గడప రాకేష్‌పై జరిగిన దాడిలో నిందితులపై కేసు నమోదు చేసిందనదుకు అప్పటి పట్టణ ఎస్ఐని ఆకస్మికంగా బదిలీ చేయించి, నేరస్తులకు శిక్ష పడకుండా చూడడంలో సీఐ ప్రధాన పాత్ర పోషించినట్టు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉద్యోగులపై పని భారం, బ్లూకోర్టు సిబ్బందితో రోజుకు రెండు డ్యూటీలు అదనంగా చేయించడం, అడ్డు చెప్పిన వారిని బదిలీ చేయించేవాడని సీఐపై ఆరోపణలున్నాయి. మంచిర్యాల ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన 8 నెలల కాలంలో టౌన్ పోలీస్‌స్టేషన్ నుండి దాదాపు 12మంది కింది స్థాయి ఉద్యోగులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఓ మహిళా కానిస్టేబుల్ ఏకంగా అధికార పార్టీకి చెందిన సీనియర్ నాయకుడి దగ్గరికెళ్లి తన బాధను వ్యక్తం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అవయవదానం కేసులో విచారణ చేసే క్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు, అంబులెన్సు డ్రైవర్ల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసులు చేశాడని అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. కరీంనగర్‌కు చెందిన పలు ప్రయివేట్ హాస్పిటల్ నిర్వాహకులతో కుమ్మకై అంబులెన్సు డ్రైవర్ల దందాకు సహకరించాడన్న ఆరోపణలున్నాయి. ఇటీవల నమోదైన రైతులకు సంబందించిన ఓ కేసు విషయంలోనూ జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకునితో కలిసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడని ఏకంగా పోలీస్ డిపార్ట్మెంట్‌లోనే చర్చ మొదలైంది. వీటితో పాటు పలు కేసుల విచారణలో జాప్యం వహించడం, అమాయకులపై కేసులు నమోదు చేయడం, పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడి పట్టణంలో లాఅండ్‌ఆర్డర్ దెబ్బతినేలా వ్యవహరించడంతోనే సీఐ ఆకస్మిక బదిలీకి కారణమంటూ పలువురు చర్చించుకుంటున్నారు.



మా భర్తలతో వెట్టిచాకిరి చేయిస్తున్నారు..

- 13వ బెటాలియన్ ముందు కానిస్టేబుల్స్ భార్యల ధర్నా



నవతెలంగాణ-హాజీపూర్

సంఘ విద్రోహ శక్తులను కట్టడి చేస్తూ ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా పోలీస్ ఉద్యోగంలో చేరిన తమ భర్తలతో వెట్టి చాకిరి చేయించడాన్ని నిరసిస్తూ గురువారం గుడిపేట్ 13వ బెటాలియన్ ముందు కానిస్టేబుళ్ల భార్యలు పిల్లలతో కలిసి ధర్నాకు దిగారు. టీజీ ఎస్పీ డౌన్ డౌన్, ఏక్ పోలీస్ వ్యవస్థ అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగా రాష్ట్రంలోనూ అదే తరహా వ్యవస్థను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఆకస్మిక బదిలీలు లేకుండా 5 సంవత్సరాలు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. తమ భర్తలకు పోలీస్ విధులు కాకుండా రోజుల తరబడి ఇతర ప్రాంతాల్లో విధులు కేటాయించడంతో కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తోందన్నారు. ఉదయం 5గంటలకే రోల్ కాల్ ఇవ్వడంతో దూరప్రాంతాల నుండి వచ్చే వారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పోలీస్ విధులకు బదులు బెటాలియన్‌లో పైస్థాయి అధికారులకు సేవలు చేయడం, గడ్డి చెక్కడం, నాలాలు శుభ్రం చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్, ఏఆర్ పోలీస్‌ల మాదిరి విధులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా సమాచారం అందుకున్న ఎస్సై గోపతి సురేష్ వారితో మాట్లాడి రహదారి పైనుండి ధర్నాను విరమింపజేశారు. తర్వాత బెటాలియన్ మెయిన్ గేటు ముందు భీష్మించుకు కూర్చున్నారు. కమాండెంట్ రాములు వారికి నచ్చజెప్పి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

జ్ఞాన తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు : డాక్టర్ రియాజ్

ఆదిలాబాద్‌టౌన్ : జ్ఞాన తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. తెలంగాణ సమాజానికి గ్రంథాలయాలతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఆ దిశగానే గ్రంథాలయాల అభివృద్ధిని ఉద్యమంలా చేపడతామని స్పష్టం చేశారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలించారు. నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అందించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ అభ్యర్థులు పాఠకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రంథాలయాలను ప్రస్తుతం అత్యధికంగా నిరుద్యోగ అభ్యర్థుల సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఆదిలాబాద్ రూరల్, మావల, భీంపూర్, సిరికొండ, గాదిగూడ మండలాల్లో నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రణాళికలు వేస్తున్నామన్నారు. గ్రంథాలయంలో సరిపడా టాయిలెట్స్ నిర్మాణానికి రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో ఉన్నటువంటి నూతన భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పాఠకులకు అవసరమైన పత్రికలు, మ్యాగజిన్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా సలహాలు, సూచనల కోసం రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని పాఠకులకు సూచించారు. కార్యక్రమంలో గౌరు శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకులు పాల్గొన్నారు.



కంది కార్యాలయం సందర్శన

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ గురువారం సందర్శించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లైబ్రరీలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలు అభివృద్ధి చెంది పాఠకులకు మరిన్ని మెరుగైన సేవలందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, ఎంఏ షకీల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, ఆవుల వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్‌రావు, రూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ - హాజీపూర్

పాఠశాల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేశారు. హాజీపూర్, ముల్కల్ల, గుడిపేట్, వేంపల్లి గ్రామాల్లో నర్సరీలను, డంప్ యార్డ్ లను పరిశీలించారు. నర్సరీల్లో విత్తనాలు నింపే బ్యాగుల్లో వాడే మట్టి నాణ్యతను పరిశీలించి తగు సూచనలు చేశారు. సబ్బపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు జియోగ్రఫీలో పాఠం బోధించారు. గుడిపేట్‌లో నిర్మాణమవుతున్న కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటనతో అధికారులు ఉలిక్కి పడ్డారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో ఉన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1 గనిలో గైర్హాజరవుతున్న కార్మికులకు గని మేనేజర్ కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 2024 వార్షిక సంవత్సరంలో సెప్టెంబర్ నెల వరకు 70 కన్న తక్కువ మస్టర్లు చేసిన ఉద్యోగులను గని మేనేజర్ విజయ్ కుమార్ గైర్హాజరుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంపెనీ ప్రస్తుత స్థితిలో మార్పు వచ్చిందని, గైర్హాజరు అయ్యే ఉద్యోగులను ఉపేక్షించే పరిస్థితిలో లేదని తెలిపారు. తరుచు గైర్హాజర్ అవుతున్న ఉద్యోగులను విధుల నుండి తొలగించి డిస్మిస్ చేసే అవకాశం ఉందని, ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరై తద్వారా కంపెనీ అందించే సంక్షేమ పథకాలను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని సంక్షేమాధికారి ఎస్.సాధన్, పిట్ ఆఫీస్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ దాడి రాజయ్య పాల్గొన్నారు.

ఎంబీఏలో సీటు సాధించిన పూర్వ విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి ముండే విఠల్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆఫ్ కర్ణాటకలో ఎంబీఏలో సీటు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థికి ప్రిన్సిపల్ అతిక్ బేగం, ఇతర అధ్యాపకులు కళాశాలలో శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘుగణపతి, స్వప్న అనిత పవార్, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉద్యోగి భాగస్వామికి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌ను డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో కాల్ హెల్త్ టీమ్ సహకారంతో ప్రారంభించారు. ఆర్టీసీ ఉద్యోగితో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్యేశంతో గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా 24 అక్టోబర్ నుంచి 29 వరకు ఉద్యోగి జీవిత భాగస్వామికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షల అనంతరం డాక్టర్ సూచనల మేరకు వైద్యం అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, ఆఫీస్ సూపరింటెండెంట్ సంతోష్ కుమార్, ఉద్యోగులు వారి జీవిత భాగస్వాములు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మించాలి

నవతెలంగాణ-తలమడుగు



మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి దాదాపు 400 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు గురువారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఆరు సంవత్సరాల నుంచి సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్ట లేదన్నారు. ఇందులో కాంట్రాక్టర్, సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం ఉందన్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వచ్చి పోయే వాహనాలతో దుమ్ముదూళి తీవ్రంగా ఉంటుందన్నారు. అక్కడి దుకాణదారులు, అటుగా వెళ్లేవారు దుమ్ముదూళికి తరుచూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వాహనాల రాకపోకలతో వర్షాకాలంలో బురుద, ఎండాకాలం దుమ్ముదూళితో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గతంలో కూడా సమస్యపై అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పద్మాకర్‌రెడ్డి, నరేష్, రాకేష్, నయీమ్, సచిన్, బబ్లు, శ్రీనివాస్, మండలవాసులు, వివిధ గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు.

బంగారం దుకాణంలో చోరీ

- 10కిలోల వెండి, 30 గ్రాముల బంగారం

ఎత్తుకెళ్లిన దొంగలు

నవతెలంగాణ-కుభీర్



మండల కేంద్రంలోని బజార్‌గల్లీలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ బంగారం దుకాణంలో దొంగతనం జరిగినట్టు దుకాణ యజమాని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే గురువారం ఉదయం సమయంలో దుకాణం వద్దకు వచ్చి చూసేసరికి బంగారం దుకాణం షటర్ వివిధ పరికరాలతో పగలకొట్టి షటర్‌ను పైకి ఎత్తి దుకాణం లోపలికి ప్రవేశించారు. దుకాణంలో ఉన్న 10కిలోల వెండితో పాటు 30గ్రాముల బంగారంతో పాటు రూ.45వేల నగదును ఎత్తికెళ్లినట్టు తెలిపారు. బంగారం షాప్ గ్రామంలో ప్రధానమైన ప్రాంతంలోనే ఉన్న దుకాణంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన చేందుతున్నారు. దీంతో చోరీ జరిగిన సంఘటనను పోలీసులకు సమాచారం అందించడంతో భైంసా రూరల్ సీఐ నైలు, కుబీర్ ఎస్సై రవీందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ బృందంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. దుకాణ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-కడెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సోషల్ మిడియా చైర్‌పర్సన్ సుప్రియ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సోషల్ మిడియా చైర్‌పర్సన్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. అలాగే బీజేపీ, బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను చేస్తున్నారని వాటిని తిప్పి కొట్టాలని కోఆర్డినేటర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్స్, సోన్న మహేష్, కళ్యాణ్, మొహమ్మద్ ముబీన్ పాల్గొన్నారు.

ఆదివాసీ గూడెల్లో బోగి సందడి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసులు తమ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపంగా బోగి పండుగను నిర్వహిస్తారు. ఆదివాసుల పండుగల్లో ప్రతి పండుగకు ఓ ప్రత్యేకత ఉంటుందని, వారి పండుగల్లో ముఖ్యమైన పెద్ద పండుగ దీపావళి, వారం రోజుల పాటు నిర్వహిస్తారు. మండలంలోని సాల్గొండ ఆదివాసులు గ్రామ పెద్ద లచ్చు పటేల్, మాన్కు పటేల్, మాజీ సర్పంచ్ కినక జుగాదితో పాటు గ్రామస్తులంతా కలిసి గురువారం రోజున భోగీ పండుగకు శ్రీకారం చుట్టారు. దీపావళి పండగ సందర్భంగా వేసె గుస్సాడి వేషాధారణకు భోగీ పూజలు చేయాల్సిందే.

గుస్సాడి వస్తువులకు సాంప్రదాయ పూజలు...

ముందుగా గుస్సాడి వేషాధారణకు ఉపయోగించే రోలు (రోకలి), డప్పులు, నెమలి ఈకలతో అలంకరించిన టోపి, డోలు, తదితర సామగ్రికి ఓకే చోట ఉంచుతారు. ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి గ్రామ పటేల్, దేవారిలు వారి సాంప్రదాయ పూజలు చేసిన తరువాత గ్రామస్తులంతా కలిసి నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఈ బోగీ పూజలనంతరం గుస్సాడి వేషధారణను వేయడం వారి సంస్కృతి సాంప్రదాయం.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు రంగురంగు పూలతో బతుకమ్మను పేర్చి అందంగా తయారు చేశారు. ఈ కార్యక్రమానికి డీఐఈఓ రవీందర్‌తో పాటు రాష్ట్ర అధ్యాపకుల సంఘం నాయకులు బలరాం జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుదర్శన్‌తో కలిసి బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులతో కలిసి అధ్యాపకులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థుల కళ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్స్ సంఘం అధ్యక్షులు గణేష్ కుమార్ జాదవ్, జిల్లా జూనియర్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, అధ్యాపకులు దినేష్‌రెడ్డి, రమేష్, మహేష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీగా గుర్తించిన 4వేల మంది అంగన్‌వాడీ టీచర్లకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు అసెంబ్లీలో మాట్లాడాలని పూర్తి వేతనం చెల్లించే విధంగా ఆర్థిక శాఖ ట్రెజరీలో అప్‌డేట్ చేయాలన్నారు. అంగన్‌వాడీలలో ఖాళీగా ఉన్న హెల్పర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో అనేక పోరాటాల ఫలితంగా మినీ అంగన్‌వాడీ టీచర్లను 1జనవరి 2024 నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్‌గా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం పెరిగిన వేతనం మూడు నెలలు మాత్రమే చెల్లించిందని, గత ఐదు నెలల నుంచి పాతవేతనమే అందిస్తున్నారన్నారు. రిటైర్మెంట్ అయినటువంటి అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా సహాయ కార్యదర్శి భాగ్య, నాయకులు సునీత పాల్గొన్నారు.

ఉట్నూర్ : అంగన్‌వాడీ టీచర్‌ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని అంగన్‌వాడీ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షురాలు రత్నమాల అన్నారు. గురువారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పీఏ భుజంగరావుని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక పోరాటాల ఫలితంగా నాలుగు వేల మంది మిని అంగన్‌వాడీ టీచర్‌లు 1జనవరి 2024 లో మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. వెట్టిచాకిరీ నుంచి ఇప్పుడే విముక్తి పొందామని ప్రభుత్వం పెంచిన వేతనాలు చెల్లించాలని కోరారు. హెల్పర్‌ను కూడా నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల కోకన్వీనర్ శ్రీనివాస్, మండలాధ్యక్షులు ముక్త పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి దాతల ఆర్థిక సాయం

- సభావత్ శ్రీనివాస్‌విజయ ట్రస్ట్ చైర్మెన్ శ్రీనివాస్ నాయక్ రూ.50వేలు
- విద్యాలయ పాఠశాల చైర్మెన్ శ్యాంరెడ్డి రూ.67వేల 470



నవతెలంగాణ-ఇచ్చోడ

బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారి వైద్య ఖర్చులకు దాతలు ముందుకు వస్తున్నారు. మండలంలోని జల్దా గ్రామానికి చెందిన అల్లెం రాములు ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఆయన కుమార్తె అల్లెం రమకుమారి ఇచ్చోడలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో ఆరోతరగతి చదువుతోంది. ఇటీవల ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించిన నయం కాకపోవడంతో ప్రస్తుతం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నట్టు తెలిపారు. ఖరీదైన వైద్యం కావడంతో కుటుంబ సభ్యులు దాతల కోసం ఎదురు చూశారు. ముందుగా సభావత్ శ్రీనివాస్‌విజయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ సభావత్ శ్రీనివాస్ నాయక్ వెంటనే స్పందించి చిన్నారి వైద్యానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50వేల నగదు అందించారు. ట్రస్ట్ సభ్యులు గురువారం ఉదయం జల్దా గ్రామానికి చేరుకొని, చిన్నారి మేనమామ శేఖర్, మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామస్తుల సమక్షంలో రూ.50వేల నగదును ట్రస్ట్ సభ్యులు కానిందే బాపూరావు, డాక్టర్ మల్లయ్య, ప్రవీణ్, మంగళగిరి రాములు, భూతి లక్ష్మణ్, ఎస్, రబ్బన్, జాదవ్ రమేష్, క్రాంతి అందజేశారు. అనంతరం ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన విద్యాలయ పాఠశాల చైర్మెన్ శ్యాంరెడ్డి రూ.67వేల 470 నగదును పాఠశాల ప్రిన్సిపాల్ సుభాష్‌రెడ్డితో కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గణేష్, టీపే మోహన్ జాదవ్, ఉపసర్పంచ్ ప్రవీణ్, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



రెండు నెలలుగా తెరుచుకోని బడి

- బడి బయట 27 మంది గిరిజన విద్యార్థులు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
- ఉపాధ్యాయులను నియమించాలని వివిధ సంఘాల, పోషకులు డిమాండ్

నవతెలంగాణ-నార్నూర్



గాదిగూడ మండలంలోని రూపాపూర్ గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక రెండు నెలల నుంచి పాఠశాల తెరుచుకోవడం లేదు. దీనితో గురువారం గ్రామంలోని పాఠశాల ముందర ఆయా సంఘాల నాయకులు, పోషకులు వచ్చి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఐటీడీఏ అధికారులు ఇప్పటి వరకు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించలేదని పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో గ్రామంలో 27 మంది ఆదివాసీ విద్యార్థులు చదువుకు దూరమై బడి బయట తిరుగుతున్నారని అన్నారు. వారందరూ పొలం బాట పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించి, నాణ్యమైన విద్యను అందించే విధంగా చూడాలని కోరారు. ఇందులో పోషకులు ఆయా సంఘాల నాయకులు కొట్నాక్ నాగొరావ్, సీతారాం, మాజీ సర్పంచ్ మడావి కేశవ్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కొట్నాక్ సక్కు, మోతిరాం, మహేందర్, గ్రామపెద్దలు మడావి రావ్‌జీ, కుడ్మేత హిరామన్, మడావి యశ్వంత్, లక్ష్మణ్ ఉన్నారు.

పులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-బోథ్

మండలంలో గత రెండు రోజుల కింద చింతలబోరీ, వజ్జర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తూ ఎద్దుపై దాడి చేసి చంపేసిన సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ గురువారం పార్డి(కె) అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. నాటిన మొక్కలను నర్సరీలను పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ ప్రాంతంలోకి ఎవరు వెళ్లవద్దని అధికారులు ప్రజలకు సూచించారు.

పులి తిప్పేశ్వర్‌కు తిరుగు ప్రయాణం...

చింతలబోరి అటవీ ప్రాంతంలో పెద్దపులి మంగళవారం కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాని కదలికపై దృష్టి సారించారు. చింతలబోరి, వజ్జర్ అటవీ ప్రాంతంలో అటవీని జల్లెడ పట్టారు. ట్రాక్ కెమెరాల ఆధారంగా దాని కదలికపై దృష్టి సారించారు. పులి బోథ్ ప్రాంతానికి వచ్చి మళ్లీ మహారాష్ట్ర వైపు తిప్పేశ్వర్‌కు తిరిగి వెళ్లిందని అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మలంగి గ్రామంలో దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ప్రవీణ్ నాయక్ తల్లి ఐదు రోజుల కింద అనారోగ్యంతో మృతి చెందింది. దీనితో గురువారం లంబాడి ఐక్యవేదిక నాయకులు ప్రవీణ్ నాయక్ నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పరామర్శించారు. పరామర్శించిన వారిలో శ్రీసేవా ఫౌండేషన్, లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు రాథోడ్ భీంరావ్, ఐటీడీఏ ఈఈ, జాదవ్ వసంత్ రావ్, చౌహన్ దేవాదాస్, బానోత్ రవీందర్ ఉన్నారు.



పెసా చట్టాన్ని గౌరవించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో ఐదో షెడ్యూల్ ప్రకారం పెసా చట్టం అమలులో ఉన్నందున వలస గిరిజనేతరులకు ఇల్లు కట్టుకునే అవకాశం ఇవ్వొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సేడ్మకి రామారావు డిమాండ్ చేశారు. గురువారం సంఘ నాయకులతో కలిసి ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్‌కు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పేసా చట్టంతో పాటు గిరిజన ప్రాంతంలో భూ బదలాయింపు నిషేధ చట్టం అమలులో ఉన్నందున 1970 తర్వాత వచ్చిన వారికి ఇలాంటి నిర్మాణాలకు అవకాశం ఇవ్వొదని కోరారు. ఈ కార్యకమంలో ఒమేష్, రమేష్, మరప శంభు, అరక దేవరావు, భీంరావు పాల్గొన్నారు.

గిరిజన యువకుడిని వరించిన డైరెక్టర్

నవతెలంగాణ-ముథోల్



మండలంలోని ఎడ్‌బిడ్ తండ గ్రామానికి చెందిన సామాన్య కార్యకర్త గిరిజన యువకుడైన రాథోడ్ రామ్‌నాథ్‌కు భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవీ వరించింది. బుధవారం ప్రభుత్వం భైంసా మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మండలానికి చెందిన యువకుడు రామ్‌నాథ్‌కు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవీ లభించింది. దీంతో గురువారం భైంసా మార్కెట్ యార్డులో డైరెక్టర్‌గా ప్రమాణం శ్రీకారం చేశారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తగా, యువకుడికి డైరెక్టర్ పదవి లభించడంపై పలువురు అభినందించారు.

ఘనంగా ఫ్లాగ్ డే రన్



నవతెలంగాణ-ఉట్నూర్

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని కేబీ కాంప్లెక్స్ ప్రాంగణం నుంచి వినాయక్‌చౌక్ వరకు టూ కే రన్‌ను ఉట్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్ఐ మనోహర్, టీఎస్ఎస్పీ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-బోథ్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడారు. ఈ రక్తదాన శిబిరంలో 84 యూనిట్ల రక్తం సేకరించడం జరిగిందన్నారు. సొనాల పూలే వెల్ఫేర్ సొసైటీ సభ్యులను, బోథ్‌కు చెందిన యువకులను పోలీసులు అభినందించారు. రక్తదానమనేది ఎంతో గొప్ప విషయమని చాలామంది రక్తం ఇస్తే మళ్లి రాదు అనే అపోహలో ఉండొద్దని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తాన్ని దానం చేసి ప్రజల ప్రాణాన్ని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్, పూలే వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రమేష్ బత్తుల, కార్యదర్శులు విజయ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు కసిరె పోతన్న, చెట్లపల్లి అనిల్, సంతోష్ రెడ్డి, మొరుగు మహేష్, బుక రాజేష్, అనీల్ మాసం, వెండి సోమేష్ పాల్గొన్నారు.

భైంసా మార్కెట్ చైర్మెన్‌గా ఆనంద్‌రావ్ పటేల్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-భైంసా

భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఆనంద్ రావ్ పటేల్ గురువారం మార్కెట్ కమిటి కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. భైంసా మండలంలోని మాంజ్రి గ్రామానికి చెందిన ఆయన గత ముప్పై సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతూ వివిధ హోదాల్లో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిస్టానం తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టినందుకు ధన్యవాదములు తెలిపారు. రైతుబిడ్డగా రైతంగా సంక్షేమానికి పాటు పడతానన్నారు. ప్రభుత్వ సహకారంతో మార్కెట్ కమిటీని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. వైస్ చైర్మెన్‌గా ఎండీ. ఫరూక్ అహ్మద్, డైరెక్టర్‌లుగా డి.రామేశ్వర్, నడిమిశెట్టి భూమన్న, షేక్ మౌలమియా, తోట రాము, రాథోడ్ రాంనాథ్, జాదవ్ సురేఖ, గడపలే దేవిదాస్, సట్ల కిష్టన్న, మాధవ్‌రావ్, సుధాకర్‌రావ్, కుంటోళ్ల విఠల్, కదం దత్తారం పటేల్ బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటి కార్యాలయానికి కాంగ్రెస్ నాయకులు అభిమానులు చేరుకొని, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | అక్టోబర్ 25, 2024 | www.navatelangana.com

తుమ్మిడిహెట్టిలో పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని శెట్టి గ్రామంలో గురువారం పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో నాలుగు సంవత్సరాలు పై బడిన పశువులకు గేదెలకు ఉచితంగా టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరు అధైర్య పడవద్దని మూగజీవాలు వ్యాధులకు గురైతే తమకు సమాచారం అందించాలన్నారు. ఇంటికి వచ్చి ఉచితంగానే వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చరందాస్, పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, బిక్షపతి, ప్రకాష్, శోభన్ ఉన్నారు.

నాటుసారా అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ప్రభుత్వం నిషేధించిన నాటు సారాను తయారు చేసిన అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. గురువారం మండలంలోని జక్కాపూర్ గ్రామంలో నాటు సారా తయారుచేసి అమ్ముతున్నారనే సమాచారం మేరకు జిల్లా దాడులు నిర్వహించారు. దుర్గే చందర్, దుర్గే యశ్వంత్, కమ్డే శ్రీను ఇంట్లో సోదాలు చేసి 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసిన, విక్రయించిన వారి వివరాలను తెలియజేయాలని కోరారు. ఈ దాడులలో ఎస్ఐ రాజేశ్వర్, సిబ్బంది వీరాస్వామి, నవీన్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మహేందర్‌రెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-కౌటాల

ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు పరిష్కారం కాని సమస్యల సాధన కోసం పీఆర్‌టీయూ టీఎస్ సంఘ అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డిని గెల్పించాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఉప్పుల నరసింహచారి కోరారు. కేజీబీవీ కౌటాల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా చాలాకాలం పనిచేసి సమాజ సేవకు ఉద్యోగాన్ని త్యాగం చేసి ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్న అత్యుత్తమ వ్యక్తిత్వం గల వ్యక్తి పీఆర్‌టీయూ టీఎస్ సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అధికారికంగా అభ్యర్థిగా ప్రకటించిందన్నారు. మెరుగైన పీఆర్సీ, బకాయి పడ్డ డీఏలు, 317 బాధిత ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కోసం, కేజీబీవీ టీచర్ల ఎంటీఎస్, సీపీఎస్ రద్దు తదితర సమస్యల పరిష్కారం కోసం బలమైన నాయకత్వం అవసరమని దానికి పీఆర్‌టీయూ టీఎస్ గెలుపు అనివార్యమని తెలిపారు. ఓటరు నమోదుకు సంబంధిత ఫారాములను నింపినంతరం ఎంఈఓ లేదా తహసీల్దార్‌లకు నవంబర్ 6లోపు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎల్. రాజు, సునార్కర్ గణపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త రమేష్, ఎంఈఓ హన్మంతు, ప్రధానోపాధ్యాయులు నారాయణ్ సింగ్, ఉపాధ్యాయులు రాంచందర్, శ్యామ్‌రావు, కవిత, రయిస్ అహ్మద్, సత్యనారాయణ, యేసుమణి, సింధు, విజయ్ సింగ్ పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు

- బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు
- ఒంటికి, రెంటికి తప్పని కష్టాలు
- పట్టించుకోని పాలకులు

ఆ మండలం 52 గ్రామాలకు జంక్షన్. నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఆదివాసీ గ్రామాల ప్రజలకు ఇక్కడి వస్తుంటారు. ఆ మండలమే కెరమెరి. ఎన్నో ఏండ్లుగా బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు చెట్లు, హోటళ్ల వద్ద బస్సు కోసం నిరీక్షించాల్సి వస్తుంది. ఎప్పటి నుంచో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు పాలకులను అధికారులను కలిసి విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. ప్రభుత్వాలు, పాలకులు మారిన మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఏర్పాటు కల నెరవేరడం లేదు. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు నిలువ నీడ కరువు అవుతుంది.

నవతెలంగాణ-కెరమెరి

52 గ్రామాలకు కెరమెరి మండల కేంద్రం జంక్షన్‌గా ఉంది. కానీ ఇక్కడ బస్సు షెల్టర్ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం పడిగాపుల కాస్తున్నారు. మండలంలోని సుమారు 52 గ్రామాల ప్రజలకు ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామాలతో అనుబంధం ఉంది. ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్, నిర్మల్, ఇచ్చోడ, ఆసిఫాబాద్, కాగజ్ నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారంతో పాటు అనేక గ్రామాలకు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ గ్రామాలకు వెళ్లేందుకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాక తప్పదు. మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేకపోవడంతో కేంద్రానికి వచ్చే ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. విద్యార్థులు, ఉద్యోగులు, ఆర్టీసీ బస్సుల కోసం రోడ్డుపైనే నిలబడాలి. బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇక్కడున్న చెట్లు షాపులు, కిరాణాషాపుల ఎదుట ప్రయాణికులు నిలబడి ఉండాల్సి వస్తుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు ప్రధాన రహదారికి ఇరువైపులా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షం కురిసినా తలదాచుకునేందుకు చోటులేక లగేజీలు, పిల్లాపాపలతో తడవాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో దుకాణాల యజమానులు ప్రయాణికులను ఈసడించుకున్న సందర్భాలు అనేకం.

అధికారులకు విన్నవించిన ఫలితం లేదు

కొన్నేండ్ల క్రితం మండల కేంద్రంలో బస్సు షెల్టర్ నిర్మాణానికి ఆర్టీసీ అధికారాలు స్థలాన్ని పరిశీలించారు. మండల మండల కేంద్రంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీగా ఉన్న ప్రదేశంలో 2016లో నాయకులతో పాటు అప్పటి ఆర్టీసీ అధికారులు స్థలాన్ని పరిశీలించి భూమి పూజ చేశారు. అయిన నేటికీ బస్సు షెల్టర్ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు.

ఒంటికి, రెంటికి ఇబ్బందులే

నిత్యం వందలాది మంది ప్రయాణికులతో వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారితో మండల కేంద్రం కిటకిటాలాడుతుంది. అలాగే ఆర్టీసీ బస్సులో ఆసిఫాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్లే ప్రయాణికులు ఒంటికి, రెంటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురుషులు ఎక్కడో ఓ చోటు దొరికొతే తమ అవసరాలు తీర్చుకుంటున్న మహిళల బాధలు వర్ణనాతీతం. ఆసిఫాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో కెరమెరి, జైనూర్ మండల కేంద్రాలతో పాటు ఏ స్టాప్ వద్ద కూడా మరుగుదొడ్లు లేవు. 75కిమీ దూరంలో ఉన్న ఉట్నూర్ డిపో వచ్చే వరకు మహిళలు అవస్థలు పడక తప్పడం లేదు. మళ్ళీ ఉట్నూర్ నుండి గుడిహత్నూర్ వరకు మరుగుదొడ్లు కానరావు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, బస్సు దిగిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్ షెల్టర్‌తో పాటు మరుగొడ్లను నిర్మించాలని కోరుతున్నారు.



బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పాలకులు పట్టించుకోవడం లేదు

కుటికల ఆనంద్‌రావు, సీఐటీయూ మండల కన్వీనర్.



మారుమూల గ్రామాల నుంచి వివిధ పనులను పనుల నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్లమీదనే వేచి చూడాల్సి వస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఏర్పాటు కోసం ప్రజా ప్రతినిధులకు, పాలకులకు విన్నవించిన ఫలితం లేకుండా పోతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి బస్సు షెల్టర్ నిర్మాణానికి కృషి చేయాలి.

మరుగుదొడ్లు నిర్మించాలి

మందాడే పార్వతి, ఖైరి గ్రామం



మండల కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఒంటికి రెంటికి మహిళలకు కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం గానీ పాలకులు గానీ మహిళల సమస్యలను పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తే మహిళలకు సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

కులగణనకు పటిష్ట చర్యలు

- జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ



నవతెలంగాణ-కెరమెరి

త్వరలో చేపట్టబోయే కులగణనకు పంచాయతీ అధికారులను నియమించనున్నట్లు జడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అంజాత్ పాషాతో కలిపి పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం కులగనన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనన్నట్లు తెలిపారు. ఈ కులగణన చేపట్టేందుకు పంచాయతీ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. కొత్త మరుగుదొడ్ల మంజూరుకు జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అదేవిధంగా మండలంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న వాటర్ ట్యాంకులపై ఎక్కేందుకు నిచ్చెనల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అణువుగా ఉన్న గ్రామాలను గుర్తించి నర్సరీలలో మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు రాంజీగూడ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. వంటగదిలో కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటి నీరు పట్టించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌దాస్, పంచాయతీ కార్యదర్శి వాజిద్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ఇసుక అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి హెచ్చరించారు. గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావులతో కలిసి జిల్లా స్థాయి కమిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వాగులు, నదుల నుండి ఇసుక అక్రమ రవాణాను అరికట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పేదవారి ఇండ్ల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు, ప్రభుత్వం చేపట్టే పనులకు మాత్రమే ఇసుక ఉచితంగా అందించడం జరుగుతుందని, జిల్లాలోని 10 మండలాలలోని గ్రామాలలో ఇసుక లభ్యం అవుతుందని తెలిపారు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఇసుక రవాణ చేయడం నిబంధనల ప్రకారం నేరమని, ఈ సమయంలో విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణ అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని, పోలీస్, రెవెన్యూ, పంచాయితీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లా నుండి మహారాష్ట్రలోని చంద్రపూర్, మంచిర్యాల, ఆదిలాబాద్ ప్రాంతాలకు ఇసుక తరలించే వాహనాలను తనిఖీ చేయాలని, రెబ్బెన, సిర్పూర్-టి, వాంకిడి, ఆసిఫాబాద్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకొని బహిరంగ వేలం వేయాలని, అనుమతి లేని వాహనాలు ఇసుక తరలిస్తే జరిమానా విధించాలన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మైనింగ్ సహాయ సంచాలకులు గంగాధర్, డివిజనల్ పంచాయతీ అధికారి ఖమార్ హుస్సేన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తికి జైలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నజగర్ పట్టణం మారుతినగర్‌కు చెందిన ఒక మహిళను మోసం చేసిన వ్యక్తికి ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ జైలు శిక్ష విధించినట్లు కాగజ్‌నగర్ టౌన్ సీఐ రాజేంద్రపసాద్ తెలిపారు. సీఐ తెలిపిన ప్రకారం మారుతినగర్‌కు చెందిన మహిళ ఇంట్లో నాగపురి అశోక్‌కుమార్ అద్దెకు ఉంటున్నాడు. సదరు మహిళకు మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకున్నాడు. అనంతరం పెళ్లి చేసుకోనని చెప్పడంతో బాధిత మహిళ 2019, డిసెంబర్ 21న కాగజ్‌నగర్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి సీఐ డి మోహన్ కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, కోర్టు కానిస్టేబుల్ బాలాజీలు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు బాధిత మహిళ తరపున కోర్టులో వాదించారు. నేరం రుజువు కావడంతో అశోక్‌కుమార్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పు ఇచ్చారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా చట్టం నుండి తప్పించుకోలేరని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్‌రావు, డీఎస్పీ రామానుజం, కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, కోర్టు డ్యూటీ అధికారి బాలాజీలతో పాటు టౌన్ సీఐ, ఎస్సైలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కుమురంభీం అడుగు జాడల్లో నడవాలి



నవతెలంగాణ-కెరమెరి

జల్, జంగిల్, జమీన్ కోసం నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించిన అమరవీరుడు కుమురం భీం అడుగుజాడల్లో నడవాలని భీం ఉత్సవ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, మాజీ ఎంపీపీ పెందూర్ రామ్, జడ్పీటీసీ ధృపతబాయి అన్నారు. భీం 84వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో భీం వర్ధంతిని జరుపుకున్నారు. భీం విగ్రహం సమీపంలోని జెండాల వద్ద గిరిజన సంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం భీం విగ్రహానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసుల మనుగడ కోసం పోరాడి అసువులు బాసిన అమర వీరుడని కీర్తించారు. ప్రతి గిరిజన బిడ్డ భీం స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందూర్ ఆనందరావు, మాజీ సర్పంచ్లు జలపతిరావు, సుమిత్రబాయి, గ్రామ పటేల్ పెందూర్ దంభిరావు, ఆదివాసీ నాయకులు మడవి రఘునాథ్, ఆదివాసీ సంఘాల నాయకులు ప్రభాకర్, బొజ్జిరావు, పెందూర్ శ్రీనివాస్, భీంరావు, రాము, మహిళ నాయకురాలు కోవ ఇందిరా పాల్గొన్నారు.

ఎల్ఓసీ లెటర్ అందజేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన దుంద్ర భీమరాజు సికిల్‌సెల్ వ్యాధితో నిమ్స్ అస్పత్రిలో చేరడంతో వైద్య చికిత్సల నిమిత్తం అతనికి సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఎల్‌ఓసీ లెటర్‌ను గురువారం అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ. 1.10 లక్షల ఎల్‌ఓసీ లెటర్‌ను బీమరాజు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రక్తదానం చేసి ప్రతి ఒక్కరు ప్రాణదాతలుగా నిలవాలని ఏఎస్పీ ప్రభాకర్ రావు తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీలు కరుణాకర్, రామానుజన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ఎంతో గొప్పదని మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని అన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని 31 వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. రక్తదానం తలసేమియా, సికిల్ సెల్, బ్లడ్ క్యాన్సర్, హిమోఫిలియా లాంటి వ్యాధులతో బాధపడుతున్న అనేక మంది రోగులకు ఉపయోగపడుతుందన్నారు. రక్తదాన శిబిరానికి అనుకున్న దాని కంటే ఎక్కువగా స్పందన రావడం పోలీసులతో పాటు యువత ముందుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రక్తదాన శిబిరంలో భాగంగా మొత్తం 51 యూనిట్లు రక్తం సేకరించినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలను వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఎస్సై ఎస్ మధుకర్ ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుండి 30 వరకు పోలీస్ సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వసతి గృహాల్లో గీజర్లు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వేడినీటి యంత్రాలను ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ కోరారు. గురువారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చలికాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వేడినీటి యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చలి తీవ్రత రోజురోజుకు పెరగడంతో పాటు ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో ఎక్కువగా చలి ఉంటుందని చల్లటినీరు స్నానం చేయడంతో విద్యార్థుల ఆరోగ్యం చెడిపోయే అవకాశం ఉంటుందన్నారు. గతంలో కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన అవి పని చేయడం లేదని, ఇదే విషయం రెండు నెలల క్రితం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందించలేదన్నారు. ఇప్పటికైనా వేడి నీటి యంత్రాలు ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

26న ఆసిఫాబాద్‌లో జాబ్‌మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల పాత కలెక్టరేట్ భవనంలోని టాస్క్ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ భవనంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 11గంటలకు జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధికల్పన అధికారి సతీష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ- హైదరాబాద్ సంస్థలో 30 ఫార్మాసిస్టు, 20 ట్రైనీ ఫార్మాసిస్టు, 20 ఫార్మసీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని, అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్ డిగ్రీ, డి-ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీసీఐ పూర్తి చేసి 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, 30 రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఇతర వివరాలకు 9550441888, 9160608476, 9440514962 నంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ టౌన్ సీఐగా రాజేంద్రప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తుత్తూరు శంకరయ్య బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రాజేంద్రప్రసాద్ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
మంచిర్యాల
4
శుక్రవారం | అక్టోబర్ 25, 2024 | www.navatelangana.com

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

నవతెలంగాణ-మంచిర్యాల



మహిళల రక్షణే షీ టీం లక్ష్యమని మంచిర్యాల షీ టీం సిబ్బంది తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని చెన్నై షాపింగ్ మాల్‌లో పని చేస్తున్న మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరు అవగాహనా కలిగి ఉండాలన్నారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆకతాయిల వేధింపులకు గురవుతున్న మహిళలు 6303923700 నెంబర్ సంప్రదించాలని కోరారు. అలాగే అత్యవసర సమయంలో డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షీ టీమ్ ఎస్ఐ హైమ, కానిస్టేబుల్ శ్రావన్ కుమార్, సతీష్, జ్యోతి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం పటిష్టంగా ఉండాలి

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి పట్టణంలోని వార్డుల్లో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణం పటిష్టంగా ఉండేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత సూచించారు. గురువారం బెల్లంపల్లి పట్టణంలోని 2, 4, 6, 29 వ్వార్డుల్లో సీసీ డ్రైన్, సీసీ రోడ్‌ల నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. సీసీ రోడ్ల కొలతలు నిర్మాణం నాణ్యత ప్రామాణికతతో ఉండేటట్లు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారుల నిబంధనలు అనుసరిస్తూ కాంట్రాక్టర్లు నాణ్యమైన నిర్మాణం చేపట్లాలన్నారు. కార్యక్రమంలో గౌరవ కౌన్సిల్ సభ్యులు అఫ్సర్, సీనియర్ నాయకులు దెబ్బటి రమేష్, మాటూరి మధు, రాజు, లాల్ యాదవ్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఏఈ సందీప్, మున్సిపల్ సిబ్బంది, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్



నవతెలంగాణ-మందమర్రి

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. గురువారం తెల్లవారుజామున ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్‌ఓ భాగంగా కాలనీలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రొగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యతని, కాలనీలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని, యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్ లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఉండే అనుమానాస్పద ప్రదేశాలలో నార్కోటిక్ డాగ్‌తో పరిశీలించారు. సమస్యలున్నా డయాల్100కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్‌లు, వాట్సాప్ కాల్స్‌లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన లేదా రవాణా చేసిన తమకు సమాచారమివ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా కాపాడాలి



నవతెలంగాణ-జన్నారం

నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శశికళ అన్నారు. గురువారం మండలంలోని మొర్రిగూడ, సింగరాయపేట, రోటిగూడ, మహమ్మదాబాద్ గ్రామాల్లో ప్రభుత్వ నర్సరీలను పరిశీలించారు. అనంతరం అక్కడ పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే హరితహారాన్ని దృష్టిలో పెట్టుకొని మొక్కలను పెంచాలన్నారు. నర్సరీలలో మొక్కలు ఎపుగా పెరగాలంటే ఎర్రమట్టిని వాడాలన్నారు. గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రవీందర్, ఆయా గ్రామాల కార్యదర్శిలు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ సెక్టర్ పరిధిలోని రేచిని-4 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల బరువులు, ఎత్తులు కొలతలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లలు, కౌరమ దశలో అందించే ఆహారం వారి ఎదుగుదలను నిర్ధారిస్తుందని తెలిపారు. పిల్లలకు సులువుగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను తినిపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై అవగహన కల్పించారు. కార్యమంలో సావిత్రి, ఆయా ప్రమీల, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని ఇందన్‌పల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ యోహాన్ కోరారు. గురువారం మండలంలోని కొత్తపేటలో ప్రజలకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ ఇన్సూరెన్స్ పథకాల గురించి వివరించారు. గ్రామీణ బ్యాంకులో మహిళా సంఘాలకు, చిరు వ్యాపారస్తులకు, మహిళా ముద్ర యోజన పథకం ద్వారా తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకొవాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రెట్టింపు స్థాయిలో రుణాలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మహేశ్, సిబ్బంది శ్రీకాంత్, గ్రామ నాయకులు ప్రేమ్ సింగ్ పాల్గొన్నారు.

మరమ్మత్తులకు నోచని చెరువులు

- బీడు వారుతున్న పొలాలు
- చిన్న నీటి పారుదలపై శాఖపై చిన్న చూపు
- ఆందోళనలో రైతులు



నవతెలంగాణ-తాండూర్

రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు రైతుల సాగుకు ప్రాణాధారమైన చెరువుల మరమ్మత్తుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో రైతుల వంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. గండ్లు పడ్డ చెరువుల మరమ్మత్తులు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పంట పొలాలు సాగుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం ఇరిగేషన్ శాఖకు నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహించడంతో వందలాది ఎకరాలు బీడు వారి పోతున్న పోతున్నాయి. చెరువుల మైనర్ రిపేర్‌లకు సైతం నిధులు కేటాయించకపోవడంతో పంట పొలాలకు నీరందక రైతులు ఒకే పంటతో సరిపెట్టుకుంటున్నారు. మరమ్మత్తులకు నోచుకొని చెరువుల్లో నీరు నిలవక రైతులు జాలరులు తీవ్రంగా నష్టపోతున్నారు. జీవనాధారమైన చెరువులు మరమ్మత్తులు నోచకపోవడంతో రైతులు వ్యవసాయ ఆధారిత కూలీలు ఆవేదన చెందుతున్నారు. మండలంలో 28 మైనర్ ఇరిగేషన్ గొలుసుకట్టు చెరువులు, 38 కుంటలున్నాయి. మండలంలో 60 శాతం మంది రైతులు గొలుసుకట్టు చెరువుల కిందనే ప్రధాన పంటగా వరి సాగు చేస్తుంటారు. రేచీని గ్రామపంచాయతీ పరిధిలోని దొంగల్ చెరువుకు గండిపడి ఏండ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో చెరువు కింద 105 ఎకరాల ఆయకట్టు బీడు భూములుగా మారాయి. దొంగల చెరువు మత్తడి లేవల్ ఎత్తుగా ఉండడంతో చెరువు మేజర్ ఇరిగేషన్ పరిధిలోకి వస్తుందని మైనర్ ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. 10 సంవత్సరాలుగా పొలాలు బీడు వారుతున్న ప్రభుత్వం చెరువు మరమ్మతలకు నిధులు మంజూరు చేయడం లేదు. గత సంవత్సరం భారీ వర్షాలకు గండిపడిన అంకెపల్లి చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో అక్కడి రైతులు పొలాలు బిల్లుగా మారాయి. అంకెపల్లి చెరువు కింద 60 ఎకరాల ఆయకట్టు ఉంది. గత సంవత్సరం గండిపడి పంట కోల్పోయిన రైతులు చెరువుకు మరమ్మతులు చేయకపోవడంతో ఈ సంవత్సరం వంట కోల్పోయారు. చెరువు మరమ్మత్తులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో వరి పంట లేక తిండిగింజలకు కరువచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకులు అధికారులు స్పందించి చెరువుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది

రవీందర్, ఏఈ ఇరిగేషన్

చౌటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంకెపల్లి చెరువు మరమ్మత్తుల కోసం గండి పూడ్చడం కోసం రూ.12 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. రేచీని పరిధిలోని దొంగల్ చెరువుకు ప్రతిపాధనాలు వేసి పంపించిన మిషన్ కాకతీయలో పూడికతీత పనులు జరిగినందున రెండవసారి నిధులు మంజూరు చేసేందుకు ఉన్నత అధికారులు విముకత చూపుతున్నారు.

రేషన్ బియ్యమే దిక్కు

నాగలింగు, లింగదాలి గూడెం



అంకెపెల్లి చెరువు కింద 100 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుకు గండి పడటంతో రెండు సంవత్సరాలుగా బియ్యపు గింజలు కరువయ్యాయి. రేషన్ బియ్యంతో కడుపు నింపుకోవాల్సి వస్తుంది. రెండు సంవత్సరాలుగా పొలాలు బీళ్లుగా మారడంతో రైతులు దినసరి కూలీలుగా మారిన పరిస్థితి ఏర్పడింది. బీడు వారిన పొలాల్లో ముళ్ళ కంపలు మొలిసి భూమి సేద్యనికి పనికి రాకుండా పోతోంది. అధికారులు స్పందించి వెంటనే చెరువు మరమ్మత్తులు చేపట్టాలి.

సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి కసరత్తు ముమ్మరం

- ఈ ఏడాదిలో 599 ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల భర్తీ
- 272 పోస్టులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన

నవతెలంగాణ-జైపూర్

ఈ ఏడాది ఎక్స్‌టర్నల్ పద్దతితో సింగరేణి ఉద్యోగాల భర్తీకి యాజమాన్యం కసరత్తు ముమ్మరం చేసింది. మొట్టమొదటి సారి ఆన్‌లైన్ పద్దతిలో పోస్టులను భర్తీ చేయాలని భావించిన సంస్థ అత్యంత పకడ్బందీగా నియామకాలు పూర్తి చేయాలని భావిస్తోంది. ఇందులో 272 పోస్టుల భర్తీకి సంబంధించి గురువారం నుండి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభించింది. వీలైనంత త్వరగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తో పాటు మెడికల్ పరిక్షలు పూర్తి చేసి నియామక పత్రాలు అభ్యర్తులకు అందేలా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో 300 మంది కారుణ్య నియామక అభ్యర్థులకు కూడా నియామక పత్రాలు అందేలా చూడాలని సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశించారు. మొత్తంగా 599 పోస్టుల్లో చేపట్టనున్న నియామకాలు రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కాగా అంతర్గత (ఇంటర్నల్) రిక్రూట్‌మెంట్ ఖాళీలు గుర్తించి నియామకాలు చేపట్టాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వార అధికారులను ఆదేశించారు. సంస్థలో మహిళలు పెద్ద సంఖ్యలో చేరుతున్న నేపథ్యంలో వారి సేవలను గనుల్లో సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కారుణ్య నియామకం ద్వార ఉద్యోగాల్లో చేరే వారిని భూగర్భ గనుల్లో విధులు నిర్వహించేందుకు విధి విధానాలను తయారు చేయాలని స్పష్టం చేశారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వార ఉత్పాదకతను పెంచడానికి అవకాశం ఉంటుందని సంస్థ భావిస్తోంది. ఈ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సుదీర్ఘ కాలంగా భూగర్భ గనుల్లో పని చేస్తున్న సీనియర్ కార్మికులకు పదోన్నతుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎండీ భావిస్తున్నారు. అదే విదంగా కొన్ని ఏరియాల్లో ఖాళీలు లేకపోవడం వల్ల కొన్ని విభాగాల్లో కార్మికులకు ప్రమోషన్ల దక్కని విషయంపై దృష్టి సారించి నివేదికలు సమర్పించాలని ఆయన సూచించారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరిన కార్మికులు గైర్హాజరు కాకుండా చూసేందుకు అన్ని ఏరియాల్లోనూ కౌన్సిలింగ్ ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలని సీఎండీ ఏరియాల అధికారులకు సూచన చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని ఎల్లరం గ్రామానికి చెందిన తుమ్మ రాజన్న (44) బుధవారం విద్యుత్ షాక్‌తో మరణించినట్టు ఎస్సై పి. సతీష్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న మధ్యాహ్నం గ్రామ శివారులో తన పంట పొలానికి నీరు అందించడానికి వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా మోటారు వద్ద విద్యుత్ షాక్ తగిలి విగతజీవిలా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనస్థలానికి ఎస్సై చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు.

పోలీసులు కూడా భాగస్వాములే

నవతెలంగాణ-జన్నారం

సమాజంలో పోలీసులు కూడా భాగస్వాములేనని ఎస్ఐ రాజ వర్దన్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు పాఠశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాజంలో పౌరుల బాధ్యత, పోలీసుల విధులు తదితర అంశాల గురించి ఆయన వివరించారు. విద్యార్థులు బాగా చదువుకుని భావి భారత పౌరులుగా మారాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





నాగల్‌కొండలో బోగ్ బండార్ పూజలు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలో నాగల్‌కొండ గ్రామంలో గ్రామస్తులంతా కలిసి గురువారం బోగ్ బండార్ పూజలు చేశారు. గత వారం రోజుల కింద పలువురు సేవా సభ్యులు తిరుపతి వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో బోగ్ బండార్ పూజలు చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయడంతో చెడు వ్యాసాలకు దూరంగా ఉంటారని సేవా సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సునీత నారాయణ్, కళావతి ఉత్తం, బంజారా మండల నాయకులు జాదవ్ దత్త, యశ్వంత్‌రావ్, గ్రామ నాయక్, కారోబారి, పటేల్, గ్రామపెద్దలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

28న ఉమ్మడి జిల్లా సదస్సు

నవతెలంగాణ-నస్పూర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 28న ఉమ్మడి జిల్లా సదస్సులో భాగంగా బహిరంగ విచారణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమీషన్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ విచారణకు జిల్లా వెనుకబడిన తరగతుల, సంచార జాతుల ప్రతినిధులు, సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, బీసీ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ ప్రాతినిధ్యాలతో హాజరు కావాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అక్కపల్లి గుడా మండల ప్రజా పరిషత్ పాఠశాలకు ఆ పాఠశాల పోషకులు వాసలా నరేష్, అంకం మహేష్, ఉలవకని మల్లేష్ రూ20వేల విలువ గల సౌండ్ సిస్టం, బజాజ్ ఫ్యాన్స్ విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగాస్వాములు కావాలన్నారు. పాఠశాలకు సౌండ్ సిస్టం ఫ్యాన్లు అందించిన వాసాల నరేష్ అంకం మహేష్ ఉలవకాని మల్లేశు లను అభినందిస్తున్నామన్నారు. అనంతరం వారిని శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపధ్యాయులు అంకం కరుణ, పనస, మౌనిక, సుద్దాల, శ్రీలత, తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

టైలరింగ్ మహిళల నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కిష్టంపేట, తంగళ్ళపల్లి, తాండూర్ ఐబీకి చెందిన టైలరింగ్ మహిళలు గురువారం నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీలక్ష్మి మహిళా టైలరింగ్ యూనియన్ అధ్యక్షురాలిగా అన్నం శ్వేత ఉపాధ్యక్షురాలిగా తాళ్లపల్లి రాజ్యలక్ష్మి జనరల్ సెక్రటరీగా చల్ల రాధ, సభ్యులుగా కొండు నాగమణి, సయ్యద్ పాతిమాతో పాటు మిగతా మహిళలందరూ సభ్యులుగా ఎన్నుకున్నారు. సంఘ సభ్యులు అందరూ ఐకమత్యంతో ఉండాలని, రేటుకు అనుకూలంగా టైలరింగ్ చేయాలని తీర్మానించారు. నిబంధనకు విరుద్ధంగా ఎవరైనా తక్కువ ధరకు టైలరింగ్ చేస్తే వారిని గ్రూప్ సభ్యత్వం నుండి తొలగించడంతో పాటు జరిమానా విధిస్తామని నూతన అధ్యక్షురాలు తెలిపారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ గ్రామాలలో నాటు సారాయి, గుడుంబ విక్రయించిన తయారు చేసిన వారిపై చర్యలుంటాయని ఎక్సైజ్ సీఐ నరసింహులు తెలిపారు. గురువారం గుడుంబా తయారు చేస్తున్న పలువురిని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ముందు బైండోవర్ చేశారు. అక్రమంగా గుడుంబా అమ్మిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బైండవర్ చేసిన వారిలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన పుటకోక్కుల నరెష్, చింతగూడ గ్రామానికి చెందిన బాణావతి లక్ష్మి మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన కామెరా మల్లు, కలమడుగు గ్రామానికి చెందిన లావుడ్యా సంతోషి, మందపల్లికి చెందిన గరి విజయలక్ష్మి, తిమ్మాపూర్‌కు చెందిన గంధం లక్ష్మి చింతలపల్లెకు చెందిన గోల్లే అమృత ఉన్నట్లు పేర్కొన్నారు. మరోసారి వీరు గుడుంబా విక్రయిస్తు పట్టుబడితే రూ.లక్ష జరిమాన విధిస్తామన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా వండాలి



నవతెలంగాణ-తాండూర్

పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని రుచిగా వండాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఎంఈఓ మల్లేశంతో కలిసి మాదారం 2 పాఠశాలలో పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లల బాగోగులు పఠన ఆసక్తిని పరిశీలించారు. పాఠ్యాంశాలోని అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో వంట కార్మికులు మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలన్నారు. వంటశాలలను వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంటల్లో తాజా కూరగాయలు, పప్పులను వాడాలని సూచించారు. పాఠశాలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు టీచర్ నియమించాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ కోరగా డిప్యూటేషన్‌పై టీచర్‌ను కేటాయించనున్నట్లు ఎంఈఓ మల్లేశం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, విద్యార్థుల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పైపు లీక్.. పాక్షికంగా దగ్ధంమైన ఇల్లు

నవతెలంగాణ-బెజ్జూర్



గ్యాస్ సిలిండర్ పైపు లీక్ అయి పాక్షికంగా ఇల్లు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గురువారం ఉదయం కంపెల వెంకటేష్ ఇంట్లోని ఉన్న గ్యాస్ సిలిండర్ పైపు లీక్ అయింది. దీంతో మంటలు చెలరేగి ఇంటికి అంటుకున్నాయి. వెంకటేష్ వంట చేసే క్రమంలో గ్యాస్ లీక్ అయి మంటలు లేవడంతో ఇల్లు అంటుకోవడంతో చుట్టుపక్కలు వారు గమనించి, నీటి పైపులతో నీరు చల్లడంతో పెను ప్రమాదం నుంచి గ్రామస్తులు కాపాడారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

చదువుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఐఈఓ పరుశురాం నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులతో పాటు రికార్డులను పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య అనేది చాలా కీలకమని, క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై ఒక ప్రణాళిక బద్ధంగా రాబోయే పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. పేద, బడుగు బలహీన వర్గాల వారిమని, తల్లి తండ్రుల కష్టాన్ని గుర్తించి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానికోసం అహర్నిషలు శ్రమించి ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం అద్యాపకుల సిలబస్ రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ కే.గౌతమ్, అధ్యాపకులు ఎం.ప్రమీల. శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, మహేందర్, సాయినాథ్, హరీష్, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

సీపీఐ(ఎం) మూడో మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-భైంసా



సీపీఐ(ఎం) మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మన సురేష్, దుర్గం నూతన్ కుమార్ కోరారు. గురువారం భైంసాలో ఏరియా మహాసభలను పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం 11 మందితో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భైంసా ఏరియా కార్యదర్శిగా దాదారావు.

భైంసా ఏరియా కార్యదర్శిగా దాదారావుతో పాటు కమిటీ సభ్యులుగా డి.పోశెట్టి, ఇప్ప లక్ష్మణ్, రమేష్ యాదవ్, శంకర్, సుమన్ బాయ్, ముత్తన్న భీంమావు, కృష్ణ దాస్, సాయన్న, నవీన్‌లను నియమించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పైడిపల్లి హనుమాన్ ఆలయం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చింతలపెల్లి గ్రామానికి చెందిన కట్లకుంట రాజన్న (50) ముల్కాల రవీందర్, లక్షెట్టిపేట వైపు నుంచి యాక్టివ స్కూటిపై జన్నారం వైపు వస్తున్నారు. హనుమాన్ టెంపుల్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి కట్లకుంట రాజన్న అక్కడికక్కడే మరణించారు. ముల్కాల రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

జీఓ 29 వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన ఓసీ అభ్యర్థులకు అన్యాయం చేసే విధంగా తెచ్చిన జీఓ 29ని వెంటనే రద్దు చేయాలని మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ అవార్డ్ గ్రహీత తీగల శ్రీనివాస్ రావు అన్నారు. రాజ్యాంగ స్పూర్తికి, సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉన్న జీఓ29ను ప్రభుత్వం రద్దు చేయాలని మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అన్యాయం చేసే విదంగా జీఓ ఉందన్నారు. జనాభా ప్రాతిపదికన ఉండాల్సిన రిజర్వేషన్లను తుంగలో తొక్కి అతి తక్కువ శాతం ఉన్న ఓసీలకు ఎక్కువ శాతం రిజర్వేషన్లను కల్పించి ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటి కైనా ప్రభుత్వం పునరాలోచించి జీఓ నెం29నిరద్దు చేయలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తరపున పీఆర్టీయూటీఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి తరపున ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన అంశాలపై తమ అభ్యర్థికి పూర్తి అవగాహన ఉందన్నారు. మెరుగైన పీఆర్సీ, బకాయి ఉన్న డీఏతో పాటు కేజీబీవీ టీచర్ల ఎంటీఎస్, సీపీఎస్ రద్దు లాంటి అంశాలపై అలుపెరుగని పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్లు మహేందర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్, కుమ్మరి రవి, పొలం దాసరి రామచందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 3 నుండి 5 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్ 19 కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ మహేష్ అభినందించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం మంచిర్యాల జిల్లాలోని కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన అండర్ 19లో ప్రతిభ కనబరిచి ముగ్గురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో అంజన్న, అశ్విత్, రాము ఉన్నారని వీరు మరింతమంది విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడరంగంలో రాణించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ తిరుపతి పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ విరాళం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ధన్నూర్-బి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 13 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా పనిచేసిన సురేష్ వైద్య గురువారం తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాలకు రూ.ఇరువై వేల విలువైన ప్రింటర్‌ను ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్‌కు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ వైద్య మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున పరీక్షల సమయంలో జీరాక్స్‌కు ఉపయోగపడుతుందని ప్రింటర్‌ను విరాళంగా ఇచ్చానని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు చోప్డె, విశ్రాంతి ఉపాధ్యాయులు రామేశ్వర్ రెడ్డి, సదాశివ రెడ్డి, వీడీసీ చైర్మన్ ఇంద్రారెడ్డి, డాక్టర్ గంగారాం, బెత్తని అడెల్లు, రాజేశ్వర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది ప్రశాంత్ కుమార్, సవిత, స్వప్న పాల్గొన్నారు.

గౌతమేశ్వరాలయంలో అనగాష్టమి వ్రతాలు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరంలో గల గౌతమేశ్వరాలయంలో గురువారం సామూహిక శ్రీ అనగాష్టమి వ్రతాలను భక్తిప్రపత్తుల నడుమ నిర్వహించారు. ప్రతి నెల అష్టమి రోజున గౌతమేశ్వరాలయంలో జరుగుతున్న సామూహిక అనఘాష్టమి రతాలలో దాదాపు 250 మంది భక్తులు పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు నీల రమాదేవి రవీందర్ దంపతులు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గౌతమేశ్వరాలయ ఫౌండర్ శ్రీదేవి, ప్రోగ్రాం చైర్మన్ పడకండి శ్రీనివాస్, వాసవి క్లబ్ క్యాబినెట్ ట్రెజరర్ కేశెట్టి వంశీకృష్ణ, హెచ్ఎం రాజు, దత్త భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రసిద్ధ దేవాలయాలు, చారిత్రాత్మక కట్టడాలు, పర్యాటకరంగ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను గుర్తించి అవసరమైన సౌకర్యాలు, సుందరీకరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి హిస్టారికల్, టూరిజం అధికారుల సమన్వయంతో జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలు, చారిత్రాత్మక కట్టడాలు, పర్యాటక ప్రదేశాలు, ప్రాజెక్టులు, జలపాతాలను మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. బాసర సరస్వతి దేవి, అడెల్లి పోచమ్మ, సదర్ మాట్ బ్యారేజ్, స్వర్ణ, కడెం, గడ్డెన్న వాగు ప్రాజెక్టులను సందర్శించే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా స్థాయి టూరిజం కమిటీని ఏర్పాటు చేసి ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. పర్యాటక ప్రదేశాలపై ఫోటో, డాక్యుమెంటరీ పోటీలను నిర్వహించాలని, మేధావులు, విద్యావంతులు, ప్రముఖులతో సంప్రదించి పర్యాటకారంగ అభివృద్ధికి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాలకు విస్తృతంగా ప్రచారం కల్పించడం కోసం ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ వంటి సామాజికమధ్యమ సాధనాలను ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం బాసర సరస్వతి ఆలయ అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతులు కల్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం వసతి సౌకర్యం మెరుగ్గా ఉండాలన్నారు. ప్రత్యేక రోజుల్లో రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదోడ్లు ఇతర వసతులను మెరుగుపరచాలని సూచించారు. గోదావరి నది వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలు నది లోపలికి వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర సమయాలలో భక్తులు సంప్రదించేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పర్యాటక శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, సీపీఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, బాసర ఆలయ ఈఓ విజయరామారావు, ఈడీఎం నదీమ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు అవిశ్రాంతంగా విధులు



నవతెలంగాణ-జైపూర్

శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అవిశ్రాంతంగా విధులు కొనసాగిస్తున్నారని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పాటు ప్లాంట్ కార్మికులు, వివిధ గ్రామాలకు చెందిన వారు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం పట్ల గతంలో లేనిపోని అపోహలు ఉండేవని, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్త దానం చేయడంలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. 1986 సంవత్సరంలో ఖానాపూర్ ఏరియాలో 18 మంది పోలీసులు అమరులైనట్లు తెలిపిన ఆయన అందులో వెంకట్ రెడ్డి అనే పోలీసు ఒకరని తెలిపారు. వెంకట్ రెడ్డి మృతి చెందిన సందర్భంగా ఆయన భార్య వనజా రెడ్డికి రెవెన్యూ శాఖలో ప్రభుత్వం ఉద్యోగావకాశం కల్పించిందని గుర్తు చేశారు. చిరు ఉద్యోగిగా రెవెన్యూ శాఖలో చేరిన పోలీస్ కుటుంబానికి చెందిన వనజా రెడ్డి అంచెలంచలుగా ఎదిగి తహసీల్దార్‌గా ప్రస్తుతం జైపూర్ మండలంలో విధులు నిర్వహించడం ఆనందమని తెలిపారు. ప్రధానంగా ఇక్కడ చేపట్టిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వనజా రెడ్డిని ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇక్కడ రక్త దాన శిబిరం ఏర్పాటు చేసిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్సై శ్రీధర్‌లను అభినందిస్తున్నట్లు తెలిపారు.

రక్త దాన శిబిరానికి విశేష స్పందన

పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరానికి విశేష స్పందన లభించింది. జైపూర్ మండల పరిధిలో గల వివిధ గ్రామ పంచాయతీల నుండి తరలివచ్చిన యువకులు రక్తదాన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన రక్త దాన శిబిరం ద్వార మొత్తం 210 యునిట్ల రక్తం సేకరించినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఇందులో జైపూర్ మండలం నుండి 112 యునిట్లు, శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన వారి నుండి 76 యూనిట్లు, భీమారం మండలానికి చెందిన వారి నుండి 21 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు.

గుడుంబా తయారీదారుల బైండోవర్

నవతెలంగాణ-బోథ్

మండలంలోని నిగిని గ్రామానికి చెందిన జాదవ్ అనుషబాయి, ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి చెందిన జాదవ్ భీమ్‌లాల్ పలుమార్లు గుడుంబా తయారు చేస్తూ దొరకడంతో బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్ర ఎదుట బైండోవర్ చేశారు. దీంతో ఆయన రూ.50 వేల చొప్పున ఒక్కొక్కరికి జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. జరిమానను సదరు వ్యక్తులతో చలాన్ రూపంలో కట్టించినట్లు పేర్కొన్నారు.

26న అండర్-17 వాలీబాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 26న తిర్యాణి ఆశ్రమోన్నత పాఠశాలలో అండర్-17 బాలుర వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య, పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి పి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో జరిగే జోనల్ పోటీలలో పాల్గొంటారని వారు వివరించారు. ఈ ఎంపిక పోటీలకు వచ్చే విద్యార్థులు ఎస్‌జీఎఫ్ ఫారంలు నాలుగు, బోనఫైడ్, ఆధార్ కార్డులు ఓరిజినల్‌తో పాటు నాలుగు సెట్ల జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. నాలుగు సెట్ల ఎస్‌జీఎఫ్ ఫారంలపై జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సంతకం ఉండాలని సూచించారు. ఈ పోటీలకు తిర్యాణి ఆశ్రమోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ కన్వీనర్‌గా కొనసాగనున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటల లోపు విద్యార్థులు రిపోర్ట్ చేయాలని, పూర్తి వివరాలకు ఆశ్రమోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్9492324005ను సంప్రదించాలని సూచించారు.

పత్తి రైతులకు అవగాహన



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో నాథ్ బయోజెన్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం రాణా-900 ప్రత్తి రకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేనేజర్ నాంపల్లి తిరుపతి మాట్లాడుతూ హైబ్రిడ్ పత్తి రాణా బి 900 గులాబీ రంగు పురుగు, రసం పీల్చు పురుగులను సమర్థవంతంగా తట్టుకొని పంట కాపుకు వస్తుందన్నారు. ఈ పత్తి పంట వేస్తే రైతులు అధిక దిగుబడి పొంది లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎ వి.సాయిక్రిష్ణ, కొలిపాక నివీన్, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

నేషనల్ అకాడమి ఆఫ్ సంరక్షణ్ జీడీయూజీకేవై ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రికల్ హౌజింగ్ వైరింగ్‌పై మూడు నెలలు ఉచిత భోజనంతో పాటు శిక్షణ అందించి ప్రయివేటు రంగంలో ఉద్యోగం కల్పిస్తామని శిక్షణ కేంద్రం నిర్వహకులు తెలిపారు. 18 నుండి 35 ఏండ్లలోపు ఆసక్తి గల నిరుద్యోగ యువకులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పుస్తకం, సర్టిఫికేట్లు, రెండు పాస్ ఫోటోలు బెల్లంపల్లిలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 8328502736 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

- మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో పాటు ఆయన కొడుకుపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య అన్నారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏలాంటి అవినీతి లేకుండా చెడు అలవాట్లు లేకుండా రాజకీయం చేసిన వ్యక్తి మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చెప్పే విధంగా గంజాయి, రౌడీయిజం బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మన మంచిర్యాల నియోజికవర్గంలో ఏరోజు జరగలేదన్నారు. మున్సిపాలిటీలో 4 సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి ప్రతీ ఒక్కరూ చూసారని ప్రజల కోసమే పని చేసుకుంటూ వచ్చామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులంతా బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే వెన్నంటే ఉన్నారన్నారు. అవినీతి చేసినట్లు ప్రజా కోర్టు పెడితే అక్కడికి రావడానికి నేను సిద్దంగా ఉన్నానని అంతే గానీ నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, నాయకులు పెట్టెం తిరుపతి, చాంద్ పాషా, అన్వర్, షాబొద్దీన్, ఇంతియాజ్, గోల్కొండ సత్తయ్య, శంకర్రావు, కాంతయ్య, సురేందర్‌రెడ్డి, సొల్లు సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఖాళీ ఉన్న చోట ఉపాధ్యాయులను నియమించాలని ఏఎస్‌యూ ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ అన్నారు. గురువారం ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తాకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పునాగూడ, అర్జిగూడ, మారేగావ్, కునికాసా, చిన్నకుండీ, పొన్నూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలలో ఖాళీగా ఉన్న చోట ఉపాధ్యాయులను నియమించి విద్య వ్యవస్థ అభివృద్ధి చేయాలనీ కోరారు. ఆయనతో పాటు మరపా గంగారాం, మడావి భగవంత్ రావ్ ఉన్నారు.

ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్స్, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కాను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఖాళీ పోస్టులను అర్హులైన నిరుద్యోగ యువతులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయమై జిల్లా ఉపాధి కల్పనాధికారి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

28న బీసీ కమిషన్ బృందం రాక

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈ నెల 28న జిల్లాకు రానుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈ కార్యక్రమం ఈ నెల 28న ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. ఈ సందర్భంగా గురువారం దీనికి సంబంధించిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీఓ వినోద్ కుమార్, డీబీసీడీఓ రాజలింగు, డీఎంహెచ్ఓ కృష్ణ, జడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి, డీఎల్పీఓ, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కారించాలి

నవతెలంగాణ-బెజ్జూర్



రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని బీఆర్ఎస్ నాయకులు కొండ రాంప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతాంగ సమస్యలపై బస్టాండ్ ఏరియాలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందన్నారు చేతగాని ప్రభుత్వం వెంటనే రాజీనామా చేసి గద్దె దిగాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతుబంధు, రైతు బీమా అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. బస్టాండ్ ఏరియాలో రాస్తారోకో చేయడంతో ఎస్ఐ విక్రం సంఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించడంతో వారు నిరసనను విరామించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూర్ల ఇస్తారి, ఖాజా మైనుద్దీన్ పాల్గొన్నారు.

28న ప్రజాభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ దామాషాను పేర్కొనే విషయంలో ఈ నెల 28న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, పార్టీల నుండి సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను ఆహ్వానించడం జరుగుతుందని, నమోదిత, నమోదు కానీ అసోసియేషన్‌ల నుండి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను సంబంధిత కేసులను పేర్కొంటూ వివరాలు సమర్పించవచ్చని తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వ్యక్తులు, కుల సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు హాజరై అభ్యర్థనలు నిర్ణీత నమూనాలో తగు సమాచారంతో రాతపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.

వర్షవాస్ ముగింపును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మూడు నెలల నుండి మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో శుక్రవారం నిర్వహిస్తున్న వర్షవాస్ ముగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘం, సిద్ధార్థ యువజన సంఘం, రమాబాయి మహిళా మండలి నాయకులు కోరారు. ఈ ముగింపు సందర్భంగా సాయంత్రం అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అంబేద్కర్ సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని వర్షవాస్ కమిటీ నాయకులు కోరారు.

వేలం పాట వాయిదా

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని మాకిడి గ్రామ శివారులో అక్రమముగా నిల్వ ఉంచిన ఇసుకను రెవిన్యూ అధికారులు, ఏడీ మైన్స్, జియాలజీ శాఖతో కలిసి కొన్ని రోజులు క్రితం స్వాధీనం చేసుకున్న ఇసుకకు వేలంపాటలో ఎవరు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఆర్ఐ మోహన్ తెలిపారు. తదుపరి వేలంపాటను ప్రభుత్వ నియమావళి ప్రకారం తెలియజేస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నూతన సీఐకి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ నూతనంగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన బుద్దె రవీందర్‌ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు విశాల్ ఖండ్రె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు జైరాజ్ మాటూరి, బీజేవైఎం నాయకులు సంతోష్ నాగపురి, సోమ శ్రీను, కార్తీక్, బొండ రాజేష్ పాల్గొన్నారు.